ఏరులై పారనున్న మద్యం

- షాపుల కోసం దరఖాస్తుల వెల్లువ
- మళ్లీ సిండికేట్‌లదే రాజ్యం
- మండల పరిధిలో ఎక్కడైనా దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు


ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సీసాలు

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మద్యం బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో నిర్మూలించి, గ్రామాల్లో మద్యం అక్రమ ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం మద్యాన్ని ఏరులై పారించేందుకు రంగాన్ని సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాలను పెంచడమే గాకుండా ఎక్కడ కావాలంటే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో మద్యం కిక్కు ఇక పల్లెలు, పట్టణాల్లో ఏ రేంజ్‌లో పెరుగుతుందో, మందుబాబులు ఎలా రెచ్చిపోతారో అర్థం చేసుకోవచ్చు. మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు కూటమి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఇప్పటికే తెరవెనుక పావులు కదుపుతున్నారు. మరికొద్ది రోజుల్లోనే మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేట్ వ్యక్తుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుంది. కాస్త అటూఇటూగా 2019కి ముందు నాటి మద్యం పాలసీనే కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టింది. మద్యం కొత్త పాలసీ ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రభుత్వం మద్యం దుకాణాలు నాలుగైదు రోజుల్లో మూతపడతాయి. లాటరీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కొత్తగా షాపులను కేటాయిస్తారు. దీంతో ఆశావహులు మద్యం షాపులు దక్కించుకునేందుకు పోటీపడి మరి దరఖాస్తు చేసుకుంటున్నారు. గత ఐదేళ్లు లిక్కర్ వ్యాపారానికి దూరంగా ఉన్న సిండికేట్లు మళ్లీ జవసత్వాలు నింపుకొని రంగంలోకి దిగారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తీసుకొస్తామంటూ ప్రభుత్వం ఆశ చూపింది. మరోపక్క సర్కారు ఖజానాను నింపే వనరుగా ఎక్సైజ్ శాఖ మారనుంది.

భారీగా దరఖాస్తులు

మద్యం కొత్త పాలసీ ప్రకారం నిడదవోలు నియోజకవర్గంలో 19 షాపులు ఏర్పాటు చేస్తారు. వాటి కోసం ఇప్పటి వరకూ 139 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిడదవోలు పట్టణంలో 31, మండలంలో 25, ఉండ్రాజవరం మండలంలో 46, పెరవలి మండలంలో 37 దరఖాస్తులు వచ్చాయి. అలాగే కొవ్వూరు నియోజకవర్గంలో 15 షాపులు ఏర్పాటు చేస్తారు. ఇప్పటి వరకూ కొవ్వూరు పట్టణంలో 3, మండలంలో 5, చాగల్లు మండలంలో 4, తాళ్లపూడి మండలం నుంచి 4 దరఖాస్తులు వచ్చాయి. ఇక గోపాలపురం నియోజకవర్గంలో 19 షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకూ గోపాలపురం మండలం నుంచి 14, దేవరపల్లి మండలం నుంచి 22, నల్లజర్ల మండలం నుంచి 28 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ సమయం ఉంది. ఈ నెల 11 జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా విధానంలో షాపుల కేటాయింపు జరుగుతుంది.

ఇష్టానుసారంగా మార్చుకోవచ్చు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో గాని 2019 ముందు టీడీపీ ప్రభుత్వ పాలనలో గాని మద్యం దుకాణాలకు నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని అబ్కారీ శాఖ అధికారులు నిర్దేశించేవారు. ఆసక్తి ఉన్నవారు కూడా ఆయా గ్రామాల పేర్లతోనే దరఖాస్తు చేసుకొని అక్కడే దుకాణం నిర్వహించుకునే వారు. కానీ ప్రస్తుత పాలసీ ప్రకారం మద్యం షాపు ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది నిర్దేశించలేదు. దీంతో లాటరీలో షాపును దక్కించుకున్న వారు నచ్చిన గ్రామంలో, నచ్చిన ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకవేళ వారు ఏర్పాటు చేసుకున్నచోట వ్యాపారం ఆశించిన స్థాయిలో లేకపోతే అధికారుల అనుమతి తీసుకుని వేరే ఊరికి మార్చుకోవచ్చు.

షాపుల కోసం తీవ్ర పోటీ..

2019 తర్వాత ఈ ఐదేళ్లు మద్యం వ్యాపారానికి దూరమైన సిండికేట్లు వేలంలో షాపులు పాడుకునేందుకు సిద్ధం అయ్యారు. వారు ఇప్పటికే తెర వెనక ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సారి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయి. ఒక్కో దరఖాస్తుదారు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాలి. ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. దీని ప్రకారం ఎంత ఎక్కువ మంది పోటీపడి దరఖాస్తు చేస్తే అంత ఎక్కువగా నాన్ రిఫండబుల్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే మద్యం షాపుల కేటాయింపులో బీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన విధివిధానాలు ఇంకా వెల్లడించలేదు. దీంతో బీసీ సంఘాల నాయకులు ఆందోళనలో ఉన్నారు. దీంతో దరఖాస్తు గడువును ఈనెల 15 వరకూ పెంచే అవకాశాలు ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

బెల్ట్ షాపుల్లో మద్యం ప్రవాహం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించారు. దీంతో మందుబాబులు తమ అలవాట్లను కొంతమేర తగ్గించుకున్నారు. ప్రస్తుతం పాత మద్యం పాలసీయే అమల్లోకి వస్తుండడంతో మళ్లీ బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. అప్పట్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి టీడీపీ ప్రభుత్వం షాపులకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రతి నెలా గరిష్ఠంగా మద్యం కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల ద్వారా వత్తిడి చేసేది. ఈ క్రమంలో ఒక్కో మద్యం షాపు నిర్వాహకుడికి మూడు నుంచి ఐదు బెల్ట్ షాపుల నిర్వహణకు అనధికారికంగా అనుమతి ఇచ్చేవారు. లైసెన్సుదారు గ్రామాల్లో బహిరంగంగా మద్యాన్ని విక్రయించినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.

క్లుప్తంగా

దూబచర్లలో 100 మందికి కంటి పరీక్షలు


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లజర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల, పార్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం దూబచర్ల గ్రామంలోని సంఘమిత్ర స్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 11 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఆ 11 మందినీ వాహనంలో వేమగిరికి పంపినట్టు క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, కార్యదర్శి నెక్కంటి వెంకటేష్, కూచిపూడి ఉదయ భాస్కరరావు, సోమిశెట్టి వెంకట్రావు, కూరపాటి నాగరాజు, మారిశెట్టి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ఉండ్రాజవరం: నిత్యావసరాలు, కూరగాయలు, వంట నూనెల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఉండ్రాజవరం ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్ పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు మరింతగా పెరిగాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు, పెట్రోలు ధరలు తగ్గిస్తామని కూటమి నేతలు చెప్పారని ఆయన గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా తయారైందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిత్యావసరాల ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కుర్చీల బహూకరణ


దూబచర్ల డైట్ కళాశాలకు కుర్చీలు బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల డైట్ పూర్వ విద్యార్థులు తామిక్కడ చదువుకుని 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ బూరయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా తాము చదువుకున్న కళాశాలకు కుర్చీలు బహూకరించారు.

బౌద్ధులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి


బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అనాలియో

ఉండ్రాజవరం: ఏపీలో బౌద్ధులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు బంతె అనాలియో కోరారు. ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠంలో ఆదివారం బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ కమిషన్ నుంచి బౌద్ధులకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జవహర్, జనరల్ సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ చౌదరి, కోశాధికారి కేవీ రమణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ

దేవరపల్లి: నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లోని రేషన్ కార్డుదారులకు ఈ నెలలో కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. రెండు మండలాలకు 40 శాతం కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేసింది. పౌరసరఫరాల శాఖ గోపాలపురం గిడ్డంగికి 28 మెట్రిక్ టన్నుల కందిపప్పు సరఫరా చేయగా, 14 మెట్రిక్ టన్నులు దేవరపల్లి మండలానికి, 14 మెట్రిక్ టన్నులు దేవరపల్లి మండలానికి కేటాయించారు. 40 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేయడంతో పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్లో కిలో కంది పప్పు రూ.160 నుంచి రూ.180 ధర పలుకుతోంది. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న కందిపప్పుకు డిమాండ్ ఏర్పడింది. రేషన్ దుకాణంలో కిలో రూ. 67 చొప్పున పంపిణీ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో కార్డుదారులందరికీ కందిపప్పు పంపిణీ చేయాలంటే రెండు మండలాలకు సుమారు 60 టన్నుల పప్పు అవసరమని అధికారులు చెబుతున్నారు. రెండు మండలాల్లో ఆదివారం నుంచి కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేస్తున్నారు.

అగ్నిమాపక ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం


జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

నిడదవోలు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తాలూకా రైస్‌మిల్లర్ల ఫంక్షన్ హాల్లో ఈ ఎన్నిక జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా నిడదవోలుకు చెందిన తమ్మినేని ఆనందరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నరసాపురానికి చెందిన శ్రీను, కార్యదర్శిగా పాలకొల్లుకు చెందిన రమాకాంత్, సహాయ కార్యదర్శిగా భీమవరానికి చెందిన నందగోపాల్, కోశాధికారిగా భీమడోలుకు చెందిన రామాంజనేయులు, సలహాదారుగా జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీనివాస్, అగ్నిమాపక ఉద్యోగుల వెల్ఫేర్ అధ్యక్షుడిగా నిడదవోలుకు చెందిన వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ సెక్రటరీగా తణుకుకు చెందిన రుద్ర నాగయ్యలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మస్తాన్, రాకేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, స్టేట్ స్పోర్ట్స్ సెక్రటరీ సప్తగిరి, గణేశ్‌లు హాజరయ్యారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

కొవ్వూరు: పట్టణంలోని బ్రిడ్జిపేటలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణపై పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై పట్టణ పోలీసులు ఇరు వర్గాలపై ఆదివారం కేసులు నమోదు చేశారు. పట్టణ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సునోద్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్రిడ్జిపేటకు చెందిన మల్లవరపు రామతేజ అనే వ్యక్తి మద్యం తాగి వచ్చి తన ఇంటికి ఎదురుగా నివసించే కోటిచుక్కల నాగమణి అనే మహిళతో తరచూ గొడవ పడేవాడు. శనివారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చిన అతడు నాగమణితో ఘర్షణపడ్డాడు. ఇదేమని ప్రశ్నించడానికి వెళ్లిన ఆమె భర్త సంసోను, తమ్ముడు చీయాదుల రాంబాబులపై రాళ్లతో రామతేజ దాడికి దిగాడు. ఈ ఘర్షణలో నాగమణికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామతేజపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఈ ఘర్షణ సందర్భంగా నాగమణి, ఆమె భర్త సంసోను, రాంబాబు దారి కాచి తనను కొట్టి గాయపరిచినట్టు రామతేజ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆ ముగ్గురిపైనా కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.సునోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రామతేజ, నాగమణి ప్రభుత్వాసుపత్రిలో చేరారు.

కోటసత్తెమ్మ కోవెలలో కోలాహలం


కోటసత్తెమ్మ ఆలయంలో సహస్రనామ కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

- 353 మంది దంపతుల సహస్ర నామ కుంకుమ పూజలు
- అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,57,918 ఆదాయం


తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోట సత్తెమ్మ వారు

నిడదవోలు రూరల్: భక్తుల కోలాహలంతో ఆదివారం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ వారి ఆలయం సందడిగా మారింది. దేవీశరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పుష్పాలంకరణతో అమ్మవారు దర్శనం ఇచ్చారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 353 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. దాతల తోడ్పాటుతో భక్తులకు చక్కెర పొంగళి, దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాద వితరణ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,57,918 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు. అలాగే సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ వారికి ప్రత్యేకంగా అలంకరించారు. గోపవరంలోని గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మెపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

దొమ్మేరు సొసైటీలో చోరీ

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు సొసైటీ గోదాములో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ గోదాములోకి దొంగలు చొరబడి రూ.10 వేల నగదు, సీసీ కెమెరా డీవీఆర్, బీఎస్ఎన్ఎల్ మోడెం అపహరించుకుని పోయారు. సొసైటీ గోదాముకు శనివారం సాయంత్రం సిబ్బంది తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం వెళ్లి వెళ్లి చూసేసరికి గోదాము వెనుక వైపు ఉన్న కిటికీ తొలగించి ఉంది. దీనిపై సొసైటీ కార్యదర్శి కేఎస్ఆర్‌వీఎస్ఎల్ఎస్‌వీ ప్రసాద్ కొవ్వూరు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న అరుంధతీయ ఉద్యోగ, టీచర్ల సంఘ నేతలు

కొవ్వూరు: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం అరుంధతీయ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన కొవ్వూరు డివిజన్‌లోని ఉపాధ్యాయులు ఈ సత్కారాలు పొందారు. రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలు మల్లిపూడి రాజు, పి.వీ రాజులు, జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత మెరిపే జలమయ్య, దున్నా ప్రకాష్, నూతంగి శ్రీనివాస్, శీలి సుశీలమ్మ, జేవీ శ్రీనివాస్, దున్నా దుర్గారావు, కొప్పాక విజయ్ కుమార్, నూతంగి పిలిఫ్‌లను సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. పెనుమాక జయరాజు, కేవీవీ సత్యనారాయణ, అయినపర్తి రాజేంద్ర ప్రసాద్, దున్నా ప్రకాశ్, బొల్లిపో మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ముప్పవరంలో అయ్యప్పల గ్రామోత్సవం


గ్రామోత్సవంలో అయ్యప్ప మాలధారులు

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామంలో ఆదివారం అయ్యప్ప మాలధారులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు కలశపూజ, పడి పూజ నిర్వహించారు. స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ నెల 15న ఇడుములు ధరించి శబరిమలై వెళతామని అయ్యప్ప మాలధారులు తెలిపారు.

వికలాంగురాలికి ట్రై సైకిల్ అందజేత


తెలికిచెర్లలో వికలాంగురాలికి ట్రై సైకిల్ అందజేసిన మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: పోలియో వల్ల నడవలేని స్థితిలో ఉన్న మండలంలోని తెలికిచెర్ల గ్రామస్తురాలు జానపోలు నాగలక్ష్మికి మానవత సంస్థ మండల శాఖ ఆదివారం రూ.15,300 విలువైన మూడు చక్రాల రిక్షా అందజేసింది. అలాగే తూర్పు చోడవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పెదముత్తి ఇస్మాయిల్‌కు రూ.5,000 ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, పల్లి వెంకట అప్పారావు, గుళ్లపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, పాతూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు 'మానవత' ఆర్థిక సాయం

తాళ్లపూడి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని రాగోలపల్లి గ్రామానికి చెందిన పిల్లబోయిన రమేష్ వైద్య ఖర్చులకు మానవత సంస్థ మండల శాఖ ఆర్థిక సాయం చేసింది. మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా ఆదివారం రూ.6 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సనపల రాజశేఖర్, తలారి మోహనరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, కేతా పోశిరావు తదితరుల పాల్గొన్నారు.

ఊరూరా శరన్నవరాత్రుల సందడి


చాగల్లులో కలశాల ఊరేగింపులో మహిళలు

- శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గామాత
- పలుచోట్ల కుంకుమ పూజలు


నిడదవోలు గోలింగేశ్వర స్వామి గుడిలో లక్షపత్రి పూజ


తాళ్లపూడిలో లలితా త్రిపుర సుందరీదేవిగా..


నల్లజర్ల మండలం పోతవరంలో కామాక్షీ అమ్మవారు


ఉండ్రాజవరంలో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో ..

తాళ్లపూడి: కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏ పల్లెలో చూసిన దసరా సందడే కనిపిస్తోంది. స్థానిక నవదుర్గా శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయ 23వ దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్రనామార్చన, లలితా పారాయణ, పల్లకీ సేవ తదితర పూజలు నిర్వహించారు. మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలోనూ అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అన్నదేవరపేట, గజ్జరం, పైడిమెట్ట, ప్రక్కిలంక, తాడిపూడి, వేగేశ్వరపురం తదితర గ్రామాల్లో అమ్మవారి మంటపాల వద్ద పూజలు నిర్వహించారు.

కంచి కామాక్షి ఆలయంలో..

నల్లజర్ల: పోతవరం గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద గల కంచి కామాక్షి అమ్మవారి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మహిళలు అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి, జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు సూరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు తాతిన సత్యనారాయణ, ఏలేటి తాతాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నిరంజన్, శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, నిత్యపూజలు, లలితా పారాయణ, సహస్ర నామార్చన, హారతి నిర్వహించారు. అలాగే అనంతపల్లి గ్రామంలోని స్వర్ణదుర్గాశ్రమంలో వల్లాల నాగబాబు, సుధారాణి దంపతులు అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామివారికి పాదపూజ, భక్తులకు అన్న సమారాధన చేశారు. నల్లజర్లలోని వనదుర్గా ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవి అలంకరించారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో కనకదుర్గమ్మ, వేలివెన్ను గ్రామంలో కొండాలమ్మ, కె.సావరం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పాలంగిలో కనకదుర్గమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యారావుపాలెం, తాడిపర్రు, కాల్దారి, చివటం తదితర గ్రామాల భవానీలతో ఆలయాలు కిటకిటలాడాయి.

స్వామివారికి లక్ష పత్రి పూజ

నిడదవోలు: స్థానిక రాజరాజేశ్వరీ సమేత గోలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం 41వ లక్ష పత్రి, కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. లక్షపత్రి పూజా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, ప్రధానార్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానికంగా కొలువైన కనకదుర్గమ్మ ఆదివారం లలితా త్రిపుర సందరీదేవి అలకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, పారాయణ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరపల్లి: శరన్నవరాత్రుల నాల్గవ రోజైన ఆదివారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ వారి ఆలయం వద్ద చండీహోమం నిర్వహించారు. మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబిక, పల్లపువీధి రామాలయం వద్ద దుర్గాదేవి అమ్మవారిని, శివాలయం వద్ద గల విజయదుర్గాదేవి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి మహిళలు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించారు.


దేవరపల్లి మండలం పల్లంట్లలో లలితా త్రిపుర సుందరీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. చాగల్లు శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనలక్ష్మి అమ్మవారిని గులాబీ పుష్పాలతో అలంకరించారు. స్థానిక పాటమ్మపేటలో బాల కనకదుర్గమ్మ ఆలయంలో కలశ పూజ చేశారు. మహిళలు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీమాత ఆలయంలో అమ్మవారికి, మీనానగరంలో ముత్యాల దిబ్బవద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ వారి ఆలయంలో భజన చేశారు. అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

జెడ్పీటీసీ లలితకు క్రైస్తవ మత పెద్దల సత్కారం


భీమోలులో జెడ్పీటీసీ సభ్యురాలు లలిత దంపతులను సత్కరిస్తున్న క్రైస్తవ మత పెద్దలు

గోపాలపురం: జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలితను ఆదివారం మండలంలోని క్రైస్తవ మత పెద్దలు సత్కరించారు. భీమోలు గ్రామంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరంలో ఆమెను సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని మత పెద్దలు ఆమెను కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతోనే తాను మండలాన్ని అభివృద్ధి చేశానని ఈ సందర్భంగా లలిత అన్నారు. అనంతరం లలితా శ్రీనివాస్ దంపతులను గ్రామపెద్దలు సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.